మొక్కుబడిగా మండల సమావేశాలు

- గైర్హాజరవుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- కోరం కోసం గంటల తరబడి ఎదురుచూపులు
- చర్చల్లో పాల్గొనని మహిళా సభ్యులు
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- నేడు పెగడపల్లి మండల సమావేశం


మండల సమావేశంలో సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు (ఫైల్)

పెగడపల్లి: మండల స్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మూడునెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు డుమ్మా కొడుతున్నా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరితో సమావేశాల లక్ష్యం నీరుగారుతోంది. ప్రతి సమావేశానికి జెడ్పీ చైర్మన్‌తో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నారు. 17 అంశాలపై చర్చించడానికి కలెక్టర్‌తో పాటు 32 మంది ఉన్నతాధికారులు పాల్గొనాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరైన సందర్భాల్లో మాత్రమే సమావేశాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇతర సందర్భాల్లో సమావేశాలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.

కఠిన చర్యలు లేకపోవడంతో..

సమావేశాలకు హాజరుకాని అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠినమైన చర్యలు లేకపోవడంతో సమావేశాల హాజరు విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సమావేశం నిర్వహించడానికి కోరం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సభ్యులకు ఫోన్లు చేసి పిలిపించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కోరం లేక సమావేశాలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందంటే ఎంపీపీ సమావేశాలకు లభిస్తున్న ఆదరణను ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

నివేదికల సమర్పణ గాలికి..

అధికారులు సైతం సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. పలువురు ఉన్నతాధికారులు తమ కింది స్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపించి చేతులు దులుపుకుంటున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలు, గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను సైతం తెలియజేసి నివేదికలను సమర్పించడం లేదు. ప్రజాప్రతినిధుల్లో కొందరికి సమస్యలపై అవగాహన లేక కొందరు.. చర్చించినా ఫలితం లేదని మరికొందరు సమస్యలను లేవనెత్తడం లేదు.

చర్చల్లో మహిళల పాత్ర శూన్యం..

మహిళా ప్రజాప్రతినిధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పెగడపల్లి మండలానికి సంబంధించి 23 సర్పంచుల్లో 12 మంది, 14 మంది ఎంపీటీసీల్లో 8 మంది మహిళలు ఉన్నారు. ఇందుల్లో ఇద్దరు, ముగ్గురు సర్పంచ్‌లు మినహా ఎవరూ సమస్యలపై స్పందించడం లేదు. ఎంపీటీసీల విషయానికొస్తే సుద్దపల్లి, ల్యాగలమర్రి, బతికపల్లి ఎంపీటీసీలు సమస్యలపై మాట్లాడుతున్నా.. అధికార పార్టీలో ఉన్నామన్న భావనతో ఏమి మాట్లాడితే తమకేమి ఇబ్బందులు ఎదురవుతాయోనని నిమ్మకుండి పోతున్నారు. ఇదిలా ఉండగా చాలామంది మహిళా ప్రతినిధుల భర్తలు, వారి కుటుంబ సభ్యులు రాజకీయాల్లో పాత్ర పోషిస్తున్నారు. మండలంలోని మహిళా ప్రతినిధుల్లో ఒకరిద్దరు మినహా మిగతా సభ్యులు నోరుమెదపడం లేదు.

అందరికీ ఆహ్వాన పత్రాలు



అధికారులు, ప్రజాప్రతినిధులు అందరికీ సమావేశాలకు సంబంధించి ఆహ్వానపత్రాలు అందజేస్తున్నాం. సమావేశానికి నివేదికలతో హాజరు కావాలని ఆదేశాలు జారీ చేస్తున్నాం. అయినా కొందరు అధికారులు సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం. అయినా వారిలో మార్పు రావడం లేదు. – పుల్లయ్య, ఎంపీడీవో

సమస్యలకు పరిష్కారమేది?



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మూడు నెలలకోసారి నిర్వహిస్తున్న మండల సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మండల స్థాయి అధికారులు మినహా జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరు కావడం లేదు. అలాంటప్పుడు సమస్యలు చెప్పుకున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. – శ్రీనివాస్, సర్పంచ్, పెగడపల్లి

అధికారులు హాజరైతేనే..



ప్రతి మూడునెలలకోసారి జరిగే మండల స్థాయి సమావేశాలకు అధికారులతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరైతేనే సమావేశానికి సార్థకత లభిస్తుంది. ప్రతి సమావేశంలో సమస్యలను లేవనెత్తినప్పటికీ పరిష్కారం కావడం లేదు. – గోలి మహేందర్‌రెడ్డి, సర్పంచ్, నంచర్ల

క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

జగిత్యాల: ఈదురుగాలులతో కూడిన వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు జేసీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పరిహారం చెల్లించి వెంటనే ఆదుకోవాలని, రాష్ట్రంలో వెంటనే ఫసల్ బీమా యోజన అమలు చేసి వరి, నువ్వు, మొక్కజొన్న మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, చింతల గంగాధర్, ఈశ్వరయ్య, కొక్కు గంగాధర్, రాంచందర్ పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీసీతారాముల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని దూలూర్ రామాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీసీతారాముల కల్యాణం భక్తజన సందడిలో కనుల పండువగా జరిగింది. ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేసి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్త, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు లక్ష్మీనారాయణ–ఆండాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, సర్పంచ్ దయ్యు లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల హంగామా



ప్రశంసాపత్రం అందిస్తున్న నరేశ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగి కళాశాలతో పాటు తల్లిదండ్రులు, గురువులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు.

విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె


నిరసన తెలుపుతున్న ఆర్టిజన్లు

కథలాపూర్: 50శాతం పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఆర్టిజన్లు కథలాపూర్‌లో మంగళవారం సమ్మెకు దిగారు. విద్యార్హతలను బట్టి జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, స్వీపర్ పోస్టులకు కన్వర్షన్ చేయాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సమ్మెను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ ఆర్టిజన్లు జితేందర్, సతీశ్, రమేశ్, వాయునందన్, నరేశ్, రాంరెడ్డి, అశోక్‌రావు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.50వేల విరాళం


దాతను సన్మానిస్తున్న పాలకమండలి సభ్యులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం మల్లాపూర్ మండలం గొర్రెపల్లికి చెందిన ఎన్ఆర్ఐ మల్లేశ్‌యాదవ్ రూ.50వేలు అందజేశారు. కాగా మంగళవారం సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ దాతను ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో డైరెక్టర్ లక్ష్మీనారాయణయాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ బాబు, అర్చకులు వెంకటరమణ, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి అధ్యక్షతన 29న శనివారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలజరాణి తెలిపారు.

కొమొరెడ్డి రామ్‌లు చేసిన సేవలు మరువలేనివి


ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న కొమొరెడ్డి కరం

మల్లాపూర్: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది కొమొరెడ్డి కరం అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని హుస్సేన్‌నగర్‌లోని మసీద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలందరూ అవకాశం ఇవ్వాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.20లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. హుస్సేన్‌నగర్ మసీద్ అభివృద్ధి కోసం రూ.3లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రొసీడింగ్ పత్రాలను మసీద్ సంఘం సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. పీసీసీ ఓబీసీసెల్ రాష్ట్ర కన్వీనర్ కొమొరెడ్డి విజయ్‌ఆజాద్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ షాకీర్, నాయకులు కటుకం గంగారెడ్డి, తేలు లక్ష్మి, వాకిటి శేఖర్‌రెడ్డి, తెలు నరేశ్, తోట సంతోష్, లింగంపెల్లి పెద్దులు, కటుకం వెంకటిరెడ్డి, సురకంటి రవి, విజయేందర్ రెడ్డి, పల్లికొండ ప్రవీణ్, పెంట ప్రణయ్‌తేజ్, మజీద్ సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలి

కొడిమ్యాల: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ.50 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నా రైతులకు భరోసా ఇవ్వడం లేదని విమర్శించారు. కలెక్టర్ క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి బాధితులను ఆదుకోవాలని కోరారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, జీవన్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోరుట్ల: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిపో పరిధిలోని పట్టణాలు, గ్రామాల ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలు చేయొచ్చన్నారు. ఫోన్ నంబర్లు 99592 25928, 73825 34960కు ఫోన్ చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముత్యంరెడ్డి

రాయికల్: రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాయికల్ మండలం భూపతిపూర్ సహకార సంఘం పరిధిలో భూపతిపూర్, ధర్మాజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, సర్పంచ్‌లు చంద్రశేఖర్, స్నేహలత, ఉపసర్పంచ్ అన్నవేని వేణు, వెంకటేశ్‌గౌడ్, సహకార సంఘం వైస్ చైర్మన్ నాగుల మల్లయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హోమగుండాలు


అయ్యప్ప ఆలయంలో భక్తులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో హోమగుండాలతో యజ్ఞాలు నిర్వహించారు. దాదాపు వంద మంది జంటలకు పైగా పాల్గొని పూజలు చేశారు.

శివపురాణం ప్రవచనాలు

జగిత్యాల: శివపురాణంలోని అనేక ఘట్టాలను వేద పండితులు స్థానిక శుభమస్తు గార్డెన్స్‌లో ప్రవచనాల ద్వారా వివరిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మహిళలు లలిత సహస్రనామ పారాయణం, సౌందర్య లహరి, శివ సహస్రనామ పారాయణం నిర్వహించారు. సామాజిక వేత్త రజినీ, రాధ, రాజేశం పాల్గొన్నారు.

ప్రపంచ మలేరియా దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీజ, హరీశ్‌కుమార్, సీహెచ్‌వో విజయభాస్కర్, సూపర్‌వైజర్ ఉష పాల్గొన్నారు.

రాయికల్ యాదవ సంఘం అధ్యక్షుడిగా మల్లయ్య

రాయికల్: మల్లన్నయాదవ సంఘం పట్టణ అధ్యక్షుడిగా జానవేని మల్లయ్య, కోశాధికారిగా మల్లేశ్, ముఖ్య సలహాదారులుగా శాంత మల్లయ్య మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

✦ నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

జగిత్యాలజోన్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు తెలిపారు.

✦ ఇంకుడుగుంతల పనులు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, దూలూర్ గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతల పనులను ఎంపీడీవో జనార్దన్ మంగళవారం ప్రారంభించారు. ఎంపీవో గంగాధర్, టీఏ అంబాజి, సర్పంచ్ దయ్యు లక్ష్మీనర్సయ్య, కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

✦ నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద కారు బోల్తా

కొడిమ్యాల: కొడిమ్యాల–నాచుపల్లి గ్రామాల మధ్య మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన శ్రీధర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. శ్రీధర్ నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలకు పనినిమిత్తం వెళ్లి వస్తుండగా రెండు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం ప్రదేశంలో కారు అదుపుతప్పి రోడ్డుపక్కనున్న గుంతలో పడిపోయింది. యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

✦ కంటివెలుగు వైద్యశిబిరం సందర్శన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మంగళవారం మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ బాలె శివాజీ సందర్శించారు. ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, అధికారి నారాయణ, వైద్యాధికారులు శ్రీజ, హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

✦ పెగడపల్లిలో శిబిరం ప్రారంభం

పెగడపల్లి: మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం జెడ్పీటీసీ రాజేందర్‌రావు ప్రారంభించారు. సర్పంచ్ శ్రీనివాస్, విండో చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, ఎంపీటీసీ జమున, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ సాగర్‌రావు, వార్డుసభ్యులు పద్మ, శంకర్ పాల్గొన్నారు.

సీపీఆర్ విధానంతో ప్రాణాలు కాపాడొచ్చు


శిక్షణ ఇస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

కోరుట్ల: సీపీఆర్ విధానంతో మనిషి ప్రాణాలు కాపాడొచ్చని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని సీఐ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీపీఆర్ విధానం ద్వారా హార్ట్ ఎటాక్, ఫిట్స్, పాముకాటుకు, కరెంట్ షాక్, ఆక్సిడెంట్ సమయాల్లో ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ సిబ్బందిలో ముఖ్యంగా బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రత్యేక సీపీఆర్ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్‌కుమార్, మేడిపెల్లి ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాలలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

మల్యాల: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో స్పందించేలా, అగ్నిమాపక యంత్రం అందుబాటులో ఉండేలా మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం జరగగా మంగళవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసుల సమాధానంపై ఎమ్మెల్సీ అసహనం

మల్యాలలో భారీ అగ్ని ప్రమాదం జరిగి రెండు రోజులు అవుతున్నా రెవెన్యూ సిబ్బంది గానీ, పోలీసులు గానీ సంఘటనా స్థలాన్ని సందర్శించి, కనీసం నష్టం అంచనా రూపొందించకపోవడంపై ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మల్యాల సీఐ రమణమూర్తికి ఫోన్ చేసి ఆరా తీయగా, ఫిర్యాదు చేస్తే విచారిస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజులవుతున్నా సంఘటనా స్థలాన్ని సందర్శించలేదని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, మాజీ మండలాధ్యక్షుడు వెల్మ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంచర్ల లక్ష్మణాచారి, రామగిరి మురళి, ఇమామ్, వీరబత్తిని పృథ్వీరాజ్, పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణంలో మార్పు చేయాలి

జగిత్యాలరూరల్: నిజామాబాద్ నుంచి మంచిర్యాల వరకు నిర్మించే ఎన్‌హెచ్–63 జాతీయ రహదారితో జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలోని నిరుపేద దళితుల బలహీనవర్గాల వారి నివాసిత గృహాలు పోతున్నాయని, జాతీయ రహదారి నిర్మాణంలో మార్పులు చేయాలని సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు లేఖ రాశారు. 50ఏళ్ల క్రితం చల్‌గల్ గ్రామంలో నిరుపేద దళితులకు ఇందిరమ్మ గృహ నిర్మాణం ద్వారా ఇళ్ల నిర్మాణం చేశారని గుర్తు చేశారు. కాగా ప్రస్తుతం జాతీయ రహదారి–63 రోడ్డు నిర్మాణంలో దళితుల ఇళ్లు కోల్పోనున్నారని, చల్‌గల్ గ్రామ శివారులో స్వల్ప మార్పులు చేయాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకుల వేతనాల విడుదలకు కృషి


వినతిపత్రం ఇస్తున్న అతిథి అధ్యాపకులు

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో అతిథి అధ్యాపకులకు ప్రభుత్వం వేతనాల విడుదల చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి అధ్యాపకులు వినతిపత్రం సమర్పించారు. ఆరునెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేతనాలు చెల్లించేలా కృషి చేయాలని కోరుతూ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ కళాశాల విద్యాకమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఫోన్లో మాట్లాడారు. వేతన బకాయిల చెల్లింపుల జాప్యంతో అతిథి అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అతిథి అధ్యాపకులు రమేశ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు


పోస్టర్ అతికిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: యువత మత్తు పదార్థాలతో బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఈ మేరకు మంగళవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి వంటి మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

గంజాయి నిర్మూలనకు విస్తృత ప్రచారం

జగిత్యాలక్రైం: గంజాయి నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్సై అనిల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జగిత్యాలరూరల్ మండల పరిధిలో గ్రామాల్లో నడిపే ఆటోలకు గంజాయి నిర్మూలన, అనర్థాలపై ముద్రించిన ఫ్లెక్సీలను ఆటోలకు అంటించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షిక సంబరాలు


పెగడపల్లి: బతికపల్లిలో వార్షికోత్సవం

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మల్యాల ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి, సర్పంచ్ శోభారాణి, సూపర్‌వైజర్ మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు మణెమ్మ, జమున, రమ, రత్నమాల, సౌజన్య, శైలజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

జగిత్యాలరూరల్: అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సర్పంచ్ చెరుకుజాన్ కోరారు. ఈ మేరకు మండలంలోని లక్ష్మీపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షిక వేడుకలు నిర్వహించారు. ఎంపీటీసీ సునీత, ధర్మపురి బహుజన సమాజ్ పార్టీ నాయకులు నక్క విజయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు జయప్రద పాల్గొన్నారు.

ప్రిస్కూల్ డే వేడుకలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ప్రిస్కూల్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందించారు. సర్పంచ్ కూన సులోచన, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, శారద, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో స్టోరీ



కొండంతా.. చిత్తడే!

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంపై సోమ, మంగళవారం రోజుల్లో కురిసిన వర్షం కారణంగా భక్తులు నానా తంటాలు పడ్డారు. ఆలయం ఆవరణ, ఆలయం లోపల సైతం నీరు నిలవడంతో చిత్తడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులకు తలదాచుకోవడానికి రెండు షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు అదనంగా మరికొన్ని షెడ్లు ఏర్పాటు చేయాలని అంజన్న భక్తులు అధికారులను కోరుతున్నారు.